# ప్రజా మారిటైం

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్

## ఇక ఉదయం 5 గంటలకే సర్వీసులు?


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 261 పేజిలు : 04 వెల రూ. 2 మంగళవారం 21 - 04 - 2026


# కాళేశ్వరంపై సీబీఐ విచారణలో అడుగు ముందుకు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మేడిగడ్డ వద్ద పియర్స్ వద్ద శాంపిళ్ల సేకరణను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- డ్రోన్ బేస్డ్ జీపీఆర్ టెస్ట్‌కు సంబంధించి సీఎంకు వివరించిన అధికారులు
- అనంతరం మీడియాలో మాట్లాడిన సీఎం
- కేసీఆర్ వచ్చి ప్రాజెక్టు పేరు మార్చి, అంచనాలు మార్చి అవినీతికి తెరతీశారని సీఎం విమర్శించారు



**హైదరాబాద్ :** మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పరిస్థితిపై సమీక్షించామన్న సీఎం రేవంత్ రెడ్డి మూడు బ్యారేజీల పరిస్థితిపై అధ్యయనం చేసిన అధికారులతో చర్చించామని తెలిపారు. కాళేశ్వరం వద్ద ఎల్ అండ్ టీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లోపాలపై ఎలా ముందుకెళ్లాలో ఒక స్పష్టత వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. సమస్యను అర్థం చేసుకోవడమే సగం పరిష్కారం ఉందని అన్నారు. ఇకనుంచి జరిగే ప్రతీ పనిలో ఎన్‌డీఎస్‌ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని, ప్రతీ పనిలో ఎన్‌డీఎస్‌ఏ అనుమతి తీసుకుని పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.అనంతరం మీడియా సమావేశంలో గత ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రాజెక్టును యథాతథంగా కొనసాగిస్తే లాభం ఉండదని కేసీఆర్ భావించారన్న సీఎం కేసీఆర్ వచ్చి పేరు మార్చి, అంచనాలు మార్చి అవినీతికి తెరతీశారని సీఎం విమర్శించారు. రూ.34 వేల కోట్ల ప్రాజెక్టును రూ.1.50 లక్షల కోట్లకు పెంచారని అన్నారు. తనకు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని భావించారని, ఆనాడు గవర్నర్ నరసింహన్‌ను మభ్యపెట్టి అబద్ధాలు చెప్పించారని తెలిపారు. - మిగతా 2 లో

## కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ



- భూపాలపల్లి జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం
- రూ.198 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శ్రీకారం

**హైదరాబాద్ :** కాళేశ్వరంలోని ఆలయ అభివృద్ధి పనులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలుత కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ - మిగతా 2 లో




## జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం

- సునామీ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు
- తీర ప్రాంతంలో మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడవచ్చన్న జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ
- ఉత్తర జపాన్‌లో సన్రికు ప్రాంతంలో భూకంపం



2 లో

## నేడు రాజస్థాన్‌లో మోదీ ప్రారంభించాల్సిన రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం

- రాజస్థాన్ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో అగ్నిప్రమాదం
- ప్రధాని మోదీ ప్రారంభోత్సవానికి ఒకరోజు ముందు ఘటన
- మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది
- ప్రమాదంలో ప్రాణనష్టంపై అధికారిక ప్రకటన లేదు
- ప్రారంభోత్సవ కార్యక్రమంపై నెలకొన్న అనిశ్చితి



**రాజస్థాన్ :** రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) రిఫైనరీలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు ఈ రిఫైనరీని ప్రారంభించాల్సి ఉండగా, ఒక్కరోజు ముందే ఈ ఘటన జరగడం తీవ్ర కలకలం - మిగతా 2 లో

## పుట్టినరోజున సతీసమేతంగా అన్న క్యాంటీన్‌లో చంద్రబాబు వడ్డన



- విజయవాడ పటమటలోని అన్న క్యాంటీన్ కు వెళ్లిన చంద్రబాబు., భువనేశ్వరి
- అల్పాహారం కోసం వచ్చిన వారికి స్వయంగా వడ్డన
- వారితో ఆప్యాంగా మాట్లాడిన ముఖ్యమంత్రి దంపతులు
- ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూడదన్న చంద్రబాబు

**అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబు తన 76వ పుట్టినరోజును పేదల మధ్య నిరాడంబరంగా జరుపుకొన్నారు. విజయవాడలోని పటమట అన్న క్యాంటీన్‌ను అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి సందర్శించి, అల్పాహారం కోసం వచ్చిన వారికి స్వయంగా వడ్డించారు. అనంతరం అక్కడి ప్రజలతో కలిసి వారు కూడా అల్పాహారం స్వీకరించారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూడదనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా చంద్రబాబు స్పష్టం చేశారు.గత ప్రభుత్వం పేదలపై కడుపుమంటతోనే అన్న క్యాంటీన్లను దుర్మార్గంగా - మిగతా 2 లో

## సంస్కృతం భారతదేశానికి ఆత్మ

- ప్రజలు ఈ భాష నేర్చుకోవాలి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- పుస్తకాలతో కాకుండా సంభాషణ ద్వారా భాష సులువుగా వస్తుందని వ్యాఖ్య
- సంస్కృతంపై ప్రజల దృక్పథంలో మార్పు రావడం సంతోషకరమన్న ఆర్ఎస్ఎస్ చీఫ్



2 లో

# తల్లి, చెల్లి, బాబాయ్ ఎవరైనా ఒకటే

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- జగన్ క్రిమినల్ రాజకీయాలపై ఆ పార్టీ కార్యకర్తలు ఆలోచించాలని చెప్పిన మంత్రి నిమ్మల రామానాయుడు
- వివేకా హత్య తరహాలోనే దస్తగిరి హత్యకు ప్లాన్ చేశారని విమర్శ
- అధికారం, డబ్బు కోసం జగన్ సొంతవారినైనా బలిచేస్తారని ధ్వజం
- ఓటమి తర్వాత కూడా 'నరుకుతాం, చంపేస్తాం' అంటున్నారంటూ మండిపాటు



2 లో

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో అధికారం, ఆస్తులు, డబ్బు కోసం ఎంతకైనా తెగించే ఒక 'విష సంస్కృతిని' వైసీపీ, ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ ప్రవేశపెట్టారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కడపలో వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనుక తాడేపల్లి ప్యాలెస్ స్క్రిప్ట్ ఉందని, సొంత పార్టీ శ్రేణులనే రాజకీయ ప్రయోజనాల కోసం బలి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య నుంచి పెద్ద దస్తగిరి హత్య వరకు అంతా ఒకే పద్ధతిలో జరుగుతోందన్నారు."రాజకీయ లబ్ధి కోసం సొంత బాబాయినే గొడ్డలిపోటుతో హతమార్చిన చరిత్ర ఆ పార్టీది. అదే బాటలో నేడు కార్యకర్తల ప్రాణాలను కూడా బలితీసుకుంటున్నారు" అని రామానాయుడు మండిపడ్డారు. కడపలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన దస్తగిరిని నిర్దాక్షిణ్యంగా పొట్టనబెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి తన రూ.100 కోట్ల రియల్ ఎస్టేట్ లావాదేవీలకు అడ్డుగా ఉన్నాడనే కారణంతోనే దస్తగిరిని హత్య చేయించారని ఆరోపించారు. "వివేకా హత్య జరిగినప్పుడు రక్తపు మడుగులో ఉన్న - మిగతా 2 లో

# సచివాలయ వ్యవస్థ పటిష్టతకు కీలక అడుగు

- 19 మందికి జిల్లా అధికారులుగా పోస్టింగ్
- సచివాలయాల వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కీలక నిర్ణయం
- 19 మంది అధికారులను జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు ఆఫీసర్లుగా నియామకం
- పంచాయతీ రాజ్ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై అధికారుల బదిలీ




2 లో

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయాల (జీఎస్‌డబ్ల్యూఎస్) వ్యవస్థను మరింత పటిష్టం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పర్యవేక్షణ, సమన్వయాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 19 మంది అధికారులను జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఆఫీసర్లుగా (డీఎస్‌డీఎస్‌డబ్ల్యూవో) నియమిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగం ఉత్తర్వులు విడుదల చేసింది.సచివాలయాల కోసం మూడంచెల పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా ఈ నియామకాలు జరిగాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఇటీవల పదోన్నతులు పొందిన 20 మంది చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈవో) నుంచి 19 మంది సేవలను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగానికి కేటాయించారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## నీటి గుడి

కాశీలోని ఒక ముసలామెకు రోజులు ముగిశాయి. యమభటులు వచ్చి 'అవా... బయలుదేరు...' అంటే ఆమె అందుకే కాచుకుని ఉన్నట్టు ఒకటీ అరా వస్తువులు ముల్లె కట్టుకొని 'పదండి నాయనా'... అని కదలబోయింది. విష్ణుభటులు ప్రత్యక్షమయ్యారు. 'మీరెందుకు వచ్చారు' అన్నారు యమభటులు ఆశ్చర్యపోయి. 'ఈ అవ్వ మా కేండేటు. స్వర్గానికి పిల్చకపోవడానికి వచ్చాము' అన్నారు. 'అంత ఘనకార్యం ఏం చేసింది అవ్వ. కొంపదీసి యజ్ఞాలుగానీ చేసిందా' అన్నారు యమభటులు. 'అంతకు మించే చేసింది. అవ్వకు కొడుకూ బిడ్డా ఎవరూ లేరు. ఉన్న ఒక్క ఇల్లు అమ్మేసి ఈ కాశీలో చలివేంద్రం పెట్టింది. ఇక్కడ రోజూ వచ్చే భక్తులు, బైరాగులు ఈమె పెట్టిన కుండల్లోని నీళ్లు తాగి దప్పిక తీర్చుకున్నారు. ఒక్క దప్పిక తీరిస్తే నూరు అశ్వమేధ యాగాల పుణ్యం. మరి ఈమె పుణ్యం లెక్కవేయడానికి మీ చిత్రగుప్తుడి చిట్టాపద్దులు సరిపోతాయా' అని అవ్వను పల్లకీ ఎక్కించి, పూలవానలో స్వర్గలోకానికి తోడ్కొని వెళ్లారు. ఈ ఎండల్లో వినదగ్గ కథే ఇది.అదేమిటో యుగాలు గడిచినా రంతిదేవుణ్ణి తలదన్నే ఉదారపురుషుడే కానరావడం లేదు. దానాలకు అన్నీ పోగా 48 రోజులు ఉపవాసం ఉన్న రంతిదేవుడికి కొంత జావా, కొన్ని నీళ్లు దక్కాయి. జావ తాగబోతే ఒక బ్రాహ్మణుడు వచ్చి 'ఆకలి' అన్నాడు. ఇచ్చేశాడు. నీళ్లు తాగబోతుంటే ఒక శూద్రుడు వచ్చి 'దప్పిక' అన్నాడు. ఇచ్చేశాడు. పాత్రలో ఉన్న చివరి నీటి చుక్కలను తాగుదామనుకునేలోపు ఒక పంచముడు వచ్చి 'అయ్యా... దప్పికతో చచ్చేలా ఉన్నాను' అనంటే ఆ చివరి నీటి చుక్కలతో పంచముడి పెదవులు తడిపాడు. అప్పుడు ఆగలేక విష్ణువు ప్రత్యక్షమై 'నీ త్యాగం ముందు నా వైకుంఠం దిగదుడుపు' అన్నాడు. 'నీకేం కావాలో కోరుకో' అనీ అన్నాడు. 'నాకేం వద్దు. ఈ లోకంలో ఎవరినీ దప్పికతో ఉంచొద్దు' అన్నాడు రంతిదేవుడు. 'తథాస్తు' అన్నాడు విష్ణువు. ఈ భగభగమండే ఎండల్లో అలా రోడ్డు మీద వెళితే ఈ 'తథాస్తు' ఏ మేరకు సిద్ధించిందో తెలుస్తుంది.పనుల మీద ఊరుగాని ఊరుకు వస్తారు చాలామంది. ఉన్న ఊళ్లోనే రెక్కాడితేగాని డొక్కాడని బతుకుకై బయలుదేరుతారు చాలామంది. జనుల ఆకలి తీర్చడానికి తిండి బుట్టలు వీపున కట్టుకుని తిరిగేవారు వేలమంది. ఇక ఈ దేశంలో కోట్ల మందికి ట్రంకు రోడ్డే ఆఫీసు, మెయిన్‌రోడ్డే షాపు. కాసింత చెట్టు నీడ కూడా దొరకని ఈ పొడవైన, నిర్దాక్షిణ్యమైన, నల్లటి రోడ్డు మీద వేసవిలో బతుకులు వెళ్లమార్చే వారంతా ఉష్ణాన్ని తట్టుకోగలరేమోగానీ దప్పికను తట్టుకోగలరా? ఏం కావాలి వీరికి? మన మనసు చల్లదనం. అది మన చేత పెట్టించే చలివేంద్రం. తడి గుడ్డ కట్టిన, చూడగానే ప్రాణం లేచి వచ్చే చల్లని మంచినీరు!'అప ఏవ ససర్జాదౌ' స్మృతివాక్యం. అంటే 'పరమాత్ముడు మొదట నీరు సృష్టించాడు'. నారము నీరును, ఆయనము నివాసము చేసుకున్నవాడు నారాయణుడు. 'నీటిలో రుచిని నేను' అన్నాడు భగవద్గీతలో కృష్ణుడు. నీళ్లతో సేవ చేయడమంటే దేవునికి పూజ చేయడమే. 'పానీయం పరమం దానం'. నీటిదానం అన్ని దానాల్లోకెల్లా గొప్పది. పామరులు ఈ మాటనే 'కుండలో నీళ్లు పోస్తే పుణ్యం వాగు పారినట్టు' అన్నారు. 'దాహం అన్నవాడికి లేదనకు. లక్ష్మి ఇల్లు కదలుతుంది' అని హెచ్చరించారు. ఉత్తర భారతాన 'ప్యావూ' అని పిలిచే చలివేంద్రాల సంస్కృతి ఉంది. ఇంటి బయట, వీధి చివర ఎవరో అజ్ఞాతవ్యక్తులు పెద్ద పెద్ద రజాయిలు పెట్టి నీళ్లు నింపుతుంటారు. ఎండన పడి వెళ్లేవాళ్లంతా తాగుతుంటారు. అజ్ఞాతంగా ఎందుకు? దప్పిక తీర్చి చెప్పుకోకూడదు. దప్పిక తీర్చామని అహానికి పోకూడదు. దప్పిక తీరినవారు ఫలానా వారికి రుణపడ్డామని అనుకోకూడదు. నీరు దైవసొత్తు. మనిషి సృష్టించింది కాదు. దైవసొత్తును మరో మనిషికి చేరవేయడంలో మన ఘనకార్యం ఏముంది? మరైతే మన దేశంలో చలివేంద్రాలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం ఏదో తెలుసా? కేరళ. గతంలో తెలుగునాట ఎండలు వస్తే పోటీలు పడి చలివేంద్రాలు పెట్టేవారు. ఇప్పుడు రీల్స్ చూడటంలో పడి బిజీగా ఉంటున్నారు. గ్లాసెడు నీరు ముంచి ఇచ్చి పోగేసుకునే సంతృప్తికి కౌంటింగ్ మెషీన్ లేదని వీరికి తెలిసేదెలా? ఎండాకాలంలో పుణ్యయాత్రలకు రెడీ అవుతుంటారు చాలామంది. మంచిదే. కాని మన ఇంటి ముందే ఒక గుడి కట్టే వీలుండే ఈ కాలాన్ని మిస్ చేసుకోవద్దు. నీటి గుడి కట్టండి. నీరున్న కుండలో దేవుడు ఉన్నాడు!

## సచివాలయ వ్యవస్థ పటిష్టతకు కీలక అడుగు

**మొదటిపేజీ తరువాయి -** వీరిని డిప్యూటేషన్ పద్ధతిపై వివిధ జిల్లాలకు డీఎస్‌జీఎస్‌డబ్ల్యూఓలుగా నియమించారు.తూర్పు గోదావరి, నంద్యాల, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, పల్నాడు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, ఏలూరు, అన్నమయ్య, కోనసీమ, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, అనంతపురం, ఎన్టీఆర్, కర్నూలు, శ్రీసత్యసాయి, కృష్ణా జిల్లాలకు కొత్త అధికారులను కేటాయించారు. పోస్టింగులు పొందిన అధికారులు తక్షణమే తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నియామకాల ద్వారా జిల్లా, మండల స్థాయిల్లో సచివాలయాల పనితీరు మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## పుట్టినరోజున సతీసమేతంగా అన్న క్యాంటీన్‌లో చంద్రబాబు వడ్డన

**మొదటిపేజీ తరువాయి -** మూసివేసిందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. అన్నం పెట్టేవారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయని, మరో 5 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కేవలం రూ.5కే నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తుండటంతో పేదలు, కార్మికులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.అన్న క్యాంటీన్లను కేవలం ప్రభుత్వ పథకంగా కాకుండా, ఒక ప్రజా ఉద్యమంగా మార్చాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అన్నదానంలో భాగస్వాములు కావాలని, ఇందుకు శక్తిమేర విరాళాలు ఇవ్వవచ్చని కోరారు. ఈ స్ఫూర్తికి తన అర్ధాంగి నారా భువనేశ్వరి నాంది పలికారని, తన పుట్టినరోజు కానుకగా రాష్ట్రంలోని అన్ని క్యాంటీన్ల ఒకరోజు నిర్వహణ ఖర్చు కింద రూ.76 లక్షలు విరాళంగా అందించారని తెలిపారు. ఆమెను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. క్యాంటీన్‌కు వచ్చిన ఆటో డ్రైవర్లు, కార్మికులతో మాట్లాడిన సీఎం.. భోజనం నాణ్యత, ఇతర ప్రభుత్వ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు.

## జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం

**మొదటిపేజీ తరువాయి -** జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఉత్తర జపాన్‌లో రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో భూప్రకంపనలు వచ్చాయి. దీనితో అధికారులు తీర ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడవచ్చని జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.54 గంటలకు ఉత్తర జపాన్‌లో సన్రికు ప్రాంతంలో భూకంపం సంభవించింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. తీర ప్రాంత ప్రజలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సురక్షిత ప్రాంతాల్లో, ఎత్తైన ప్రదేశాల్లోనే ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు. జపాన్ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా భూకంపాలు సంభవించే దేశాల్లో ఒకటి. సాధారణంగా ప్రతి సంవత్సరం దాదాపు 1,500 వరకు భూకంపాలు సంభవిస్తాయి.

## కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ



**మొదటిపేజీ తరువాయి -** చేశారు.అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుని, ఎన్డీఎస్ఏ ఛైర్మన్ అనిల్ జైన్‌తో కలిసి బ్యారేజీని పరిశీలిస్తారు. ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారు. అక్కడి నుంచి కాటారం మండలం నస్తూరిపల్లికి వెళ్తారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారు. ఈ సభలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా రెండో విడత నిధులను విడుదల చేస్తారు.

# తల్లి, చెల్లి, బాబాయ్ ఎవరైనా ఒకటే



**మొదటిపేజీ తరువాయి -** మృతదేహాన్ని గుండెపోటుగా చిత్రీకరించి, సాక్ష్యాలను ఎలా తుడిచిపెట్టారో, నేడు దస్తగిరి హత్య విషయంలోనూ అదే పంథాను అనుసరిస్తున్నారు. హత్య చేసిన నిందితులు నేరుగా వెళ్లి నిత్యానంద రెడ్డిని కలవడం చూస్తుంటే, ఈ హత్యల వెనుక ఎవరి అండదండలు ఉన్నాయో స్పష్టమవుతోంది. రాష్ట్రంలో హత్యారాజకీయాలకు, గొడ్డలి సంస్కృతికి వైసీపీ కేరాఫ్ అడ్రస్‌గా మారింది" అని నిమ్మల విమర్శించారు.వైఎస్సార్సీపీ అధినేత జగన్‌ది రాజకీయ ఆలోచన కాదని, అది పక్కా 'క్రిమినల్ మైండ్' అని మంత్రి తీవ్రంగా విమర్శించారు. గతంలో జగన్ పరామర్శ యాత్రలో జరిగిన ఘటనను గుర్తుచేస్తూ, "సాధారణంగా రోడ్డు మీద ఎవరైనా ప్రమాదానికి గురైతే మానవత్వంతో ఆసుపత్రికి పంపిస్తాం. కానీ జగన్ తన కాన్వాయ్ చక్రాల కింద సొంత కార్యకర్త నలిగి చనిపోతుంటే, కారు కింద నిమ్మకాయ నలిగినట్లుగా భావించి, ఆ శవాన్ని పొదల్లోకి విసిరేసి వెళ్లారంటే ఆయనలో మానవత్వం ఉందా?" అని ప్రశ్నించారు. అధికారం, డబ్బు తప్ప జగన్‌కు మరేమీ కనిపించవని, తన ప్రయోజనాల కోసం తల్లి, చెల్లి, బాబాయ్, కార్యకర్త ఎవరైనా ఆయన దృష్టిలో ఒక వస్తువు మాత్రమేనని దుయ్యబట్టారు. 2018 నాటి 'కోడికత్తి' డ్రామాతో సానుభూతి పొంది, ఆ కేసులో నిందితుడైన ఒక దళిత యువకుడి జీవితాన్ని బలిపెట్టారని గుర్తుచేశారు.2024 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి ఓడించినా జగన్‌లో మార్పు రాలేదని రామానాయుడు అన్నారు. తనను ఓడించారనే కక్షతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందకూడదని, ప్రజలు సుఖంగా ఉండకూడదని కోరుకుంటున్నారని ఆరోపించారు. ఓటమి తర్వాత తప్పులు సరిదిద్దుకుంటామని చెప్పాల్సింది పోయి, "చంపేస్తాం, నరికేస్తాం, అంతు చూస్తాం" అంటూ వీధి రౌడీల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యంలో ఉండే పార్టీ లక్షణం కాదన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో మళ్ళీ చిచ్చు పెట్టాలని, అభివృద్ధికి అడ్డుపడాలని జగన్ ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు."జగన్ రెడ్డి గారూ.. మీ నేతలు చేసే ప్రతి కబ్జా, ప్రతి సెటిల్మెంట్ వాటా తాడేపల్లికి చేరుతున్న మాట వాస్తవం కాదా? మీ ధనదాహానికి అడ్డు తగిలితే సొంత కార్యకర్తలైనా చంపేస్తారా?" అని నిమ్మల సూటిగా ప్రశ్నించారు. వైసీపీ కార్యకర్తలు ఒక విషయం గమనించాలని, జగన్ వారిని కేవలం 'పనిముట్లు'గా వాడుకొని అవసరం తీరాక దస్తగిరిలా గాలికి వదిలేస్తారని హెచ్చరించారు. అభివృద్ధిని అడ్డుకోవడం, ప్రజలను బెదిరించడమే లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ 'గొడ్డలి పార్టీ'గా, 'రప్పా రప్పా' పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ 'రౌడీ రాజకీయం' ఇకపై సాగదని, గొడ్డలి సంస్కృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు శాశ్వతంగా సమాధి కట్టడం ఖాయమని హెచ్చరించారు.

## నేడు రాజస్థాన్‌లో మోదీ ప్రారంభించాల్సిన రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి -** రేపింది. దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌గా దీనిని నిర్మించారు. హెచ్‌పీసీఎల్, రాజస్థాన్ ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో సుమారు రూ.79,459 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం గానీ, గాయాలు గానీ అయినట్లు ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి సమాచారం లేదు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరై, జాతికి అంకితం చేయాల్సి ఉంది. ఈ సందర్భంగా ఆయన ఎల్పీజీ ట్యాంకర్లను జెండా ఊపి ప్రారంభించి, బహిరంగ సభలో ప్రసంగిస్తారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. కార్యక్రమం కోసం సుమారు 5,000 మంది పోలీసు సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటన, రిఫైనరీ ప్రారంభోత్సవ కార్యక్రమం యథాతథంగా జరుగుతుందా లేదా అనే దానిపై అనిశ్చితి నెలకొంది. దీనిపై అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



# సంస్కృతం భారతదేశానికి ఆత్మ



**మొదటిపేజీ తరువాయి -** సంస్కృతం భారతదేశానికి ఆత్మ వంటిదని, దేశ సాంస్కృతిక, నాగరికత కొనసాగింపునకు ఇది అత్యంత కీలకమని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ఇవాళ ఢిల్లీలో సంస్కృత భారతి కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సంస్కృతాన్ని ఆధునిక సంభాషణా మాధ్యమంగా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది.ఈ కార్యక్రమంలో భగవత్ మాట్లాడుతూ.. "భారతదేశం కేవలం ఒక భౌగోళిక లేదా రాజకీయ అస్తిత్వం కాదు. ఇది ఒక సజీవ సంప్రదాయం. ఈ దేశ ఆలోచనా విధానానికి, జీవన సంస్కృతికి సంస్కృతమే మూలం. అందుకే సంస్కృతం కేవలం భాష కాదు, ఈ దేశపు ఆత్మ" అని వివరించారు.భాషను నేర్చుకునే పద్ధతిపై ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. "పాఠశాలల్లో శ్లోకాలను బట్టీ పట్టించడం వల్ల చిన్నప్పుడు సంస్కృతం కష్టంగా అనిపించేది. కానీ, ఇంట్లో అదే భాషను సహజంగా మాట్లాడినప్పుడు సులువుగా ఉండేది. ఏ భాషనైనా నేర్చుకోవడానికి పుస్తకాలు కాదు, నిరంతర సంభాషణే అత్యంత సులభమైన, ఉత్తమమైన మార్గం" అని సూచించారు. నిత్యం ఆ భాష మాట్లాడే వారి మధ్య ఉంటూ, వినడం, మాట్లాడటం ద్వారా భాష సులభంగా వస్తుందని తెలిపారు.దేశవ్యాప్తంగా సంస్కృతంపై మళ్లీ ఆసక్తిని పెంచడంలో సంస్కృత భారతి విజయం సాధించిందని భగవత్ ప్రశంసించారు. గత 15 ఏళ్లలో సమాజంలో సంస్కృతం పట్ల దృక్పథంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. కొత్త కార్యాలయం ఏర్పాటు సంతోషకరమే అయినప్పటికీ, అది పనికి కారణం కాదని, విస్తరించిన పనికి దక్కిన ఫలితమని ఆయన పేర్కొన్నారు.

# కాళేశ్వరంపై సీబీఐవిచారణలో అడుగు ముందుకు

**మొదటిపేజీ తరువాయి -** మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు ఉన్నాయని 2020లోనే ఇంజినీర్లు చెప్పారని గుర్తు చేశారు. ఇంజినీర్ల లేఖలను సీఎం, ఎల్ అండ్ టీ సంస్థ పట్టించుకోలేదని ఆరోపించారు. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలి పోయిందని ఆరోపించారు. అన్నీ దాచిపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని ప్రయత్నించారని, కాని ప్రకృతి మరొకటి తలచి అది పూర్తిగా కుంగిపోవడంతో ప్రపంచానికి అసలు విషయం తెలిసిందన్నారు.కాళేశ్వరంపై సీబీఐ విచారణ విషయంలో అడుగు ముందుకు పడుతోందన్న సీఎం సీబీఐ విచారణలో కదలిక వచ్చిందని తెలిసి హడావుడిగా ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణను అడ్డుకునేందుకే ఢిల్లీకి వెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారని, కేంద్రం కాళ్లు పట్టుకునేందుకు హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లారని విమర్శించారు. మూడు బ్యారేజీల్లో నీళ్లు నింపటం ప్రమాదకరమని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని అన్నారు. ఘోర తప్పిదాలు జరిగాయని పీసీ ఘోష్ జ్యుడీషియల్ కమిషన్ కూడా చెప్పిందని, నివేదికపై అసెంబ్లీలో సుదీర్ఘమైన చర్చ చేసి కేసును సీబీఐ విచారణకు అప్పగించామని గుర్తు చేశారు.సీబీఐ విచారణకు అప్పగించి 9 నెలలు అవుతున్నా కేంద్రం నుంచి స్పందన లేదని, కేంద్రం ప్రభుత్వం కాళేశ్వరంపై ఇప్పటికీ సీబీఐ విచారణకు ఆదేశించలేదని, 2019 నుంచి ఈ ప్రాజెక్టు ద్వారా 162 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశామని తెలిపారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టును వృథాగా పోనీయలేమని, మరమ్మతులు పూర్తి చేసి ప్రాజెక్టును ఉపయోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.గతంలో కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లే మనకు నీరు అందుతోందని తెలిపారు. సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లోనే చర్యలు తీసుకుంటామని కిషన్‌రెడ్డి అన్నారని, 9 నెలలు అవుతున్నా సీబీఐ ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు. న్యాయనిపుణులతో చర్చించేందుకు హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని, కోర్టులో తీర్పు రిజర్వ్ అయ్యాక లాయర్లతో చర్చించటానికి ఏముంటుంది? అని ప్రశ్నించారు.అంతకుముందు మేడిగడ్డ బ్యారేజ్ పియర్స్ వద్ద శాంపిళ్ల సేకరణను రేవంత్ రెడ్డి పరిశీలించారు. కుంగిన ఏడో బ్లాక్ వద్ద డ్రిల్లింగ్ పనులు సీఎం, మంత్రులు పరిశీలించారు. బ్యారేజీ వద్ద చేస్తున్న పరీక్షల వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. సీఎంతో పాటు ఎన్‌డీఎస్ఏ ఛైర్మన్ అనిల్‌జైన్ మేడిగడ్డ బ్యారేజీ పరిశీలించారు.జియో టెక్నికల్, జియో ఫిజికల్, జీపీఆర్ శాంపిళ్లు ఎలా తీస్తున్నారో రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం మొత్తం 520 శాంపిళ్లు సేకరించి సీడబ్ల్యూఆర్పీఎస్‌కు పంపనుంది. ల్యాబ్‌లో పరీక్షల తర్వాత మేడిగడ్డ బ్యారేజీ డ్యామేజీపై పూర్తి అవగాహన వస్తుంది. డ్రోన్ బేస్డ్ జీపీఆర్ టెస్ట్‌కు సంబంధించి అధికారులు సీఎంకు వివరించారు. ప్యారలర్ క్రాస్ హోల్ సెస్మిక్ టెస్ట్ వివరాలను కూడా సీఎంకు వివరించారు.అంతకు ముందు కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఇవాళ కాళేశ్వరం పర్యటనకు వచ్చిన సీఎం మంత్రులతో కలిసి శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.198 కోట్లతో జరిగే ఆలయ అభివృద్ధి పనులకు సీఎం భూమి పూజ చేశారు. కాళేశ్వరం చేరుకున్న సీఎంకు మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ స్వాగతం పలికారు.



# కేసీఆర్ జగిత్యాల సభకు హరీశ్ రావు గైర్హాజరు



**మొదటిపేజీ తరువాయి -** చాలా రోజుల విరామం తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఆయన ఇవాళ జగిత్యాలలో నిర్వహించనున్న 'బీఆర్ఎస్ ఆశీర్వాద సభ'లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇందుకోసం సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి ఆయన బయలుదేరను న్నారు. అయితే, పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ సభకు కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గైర్హాజరు కావడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.పార్టీ ముఖ్య నేతలంతా జగిత్యాల సభ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా, హరీశ్ రావు మాత్రం పార్టీ నేతలు బి. వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్రతో కలిసి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కేసీఆర్ సభ జరుగుతున్న రోజే ఈ కీలక నేతలు ఢిల్లీకి వెళ్లడం వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రెండు కీలకమైన న్యాయపరమైన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించేందుకే ఈ పర్యటన చేపట్టినట్లు పార్టీ వర్గాల సమాచారం.కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ పూర్తిచేసిన ధర్మాసనం, ఈ నెల 22న తుది తీర్పును వెలువరించనుంది. ఒకవేళ తీర్పు ప్రతికూలంగా వస్తే వెంటనే సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ముందస్తుగా న్యాయవాదులతో మంతనాలు జరిపేందుకు హరీశ్ రావు బృందం ఢిల్లీకి వెళ్లినట్లు తెలుస్తోంది.దీంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో స్పీకర్ తీర్పు అనంతరం చేపట్టాల్సిన న్యాయపరమైన కార్యాచరణపై కూడా ఈ పర్యటనలో చర్చిస్తున్నట్లు సమాచారం. ఓవైపు కేసీఆర్ బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు కీలక నేతలు న్యాయపోరాటాలకు సిద్ధం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జగిత్యాల సభను విజయవంతం చేసేందుకు కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు భారీగా జన సమీకరణ చేపట్టారు.

# పెద్దపల్లి జిల్లాలో దారుణం... చిన్నారిని పీక్కుతిన్న వీధికుక్కలు

**సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో దుర్ఘటన**

**ఇంటి ముందు ఆడుకుంటుండగా మూడేళ్ల బాలికపై వీధి కుక్కల దాడి**

**పొలాల్లోకి లాక్కెళ్లి పీక్కుతిన్న కుక్కలు**

తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. దివ్యా బెహ్రా అనే బాలిక తమ ఇంటి ముందు వీధిలో ఆడుకుంటోంది. ఈ సమయంలో బాలికపై కుక్కలు దాడి చేశాయి.కుక్కలు బాలికను నోట కరుచుకుని పొలాల్లోకి తీసుకువెళ్లాయి. ఈ క్రమంలో కుక్కలు పీక్కుతినడంతో తీవ్రగాయాలతో చిన్నారి మృతి చెందింది. చిన్నారి తల్లిదండ్రులు ఒడిశా నుంచి వచ్చి ఇటుకబట్టీల్లో పని చేస్తున్నారు. తమ ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ హృదయ విదారకమైన ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.



# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బీసీ వెల్ఫేర్ పాఠశాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**గొల్లపల్లి, ఏప్రిల్ 20 (ప్రజా మంటలు):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గొల్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఆహారం రుచి, నాణ్యతపై అభిప్రాయాలు సేకరించారు. భోజనం సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. డైట్ మెనూ అమలు, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ విధానాలు, కిచెన్ షెడ్ నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వారికి అందించే భోజనం నాణ్యంగా, పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. వంటశాలల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించి, నాణ్యమైన పదార్థాలతో ఆహారం సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సంక్షేమ పాఠశాలల్లో మెనూ సమర్థవంతంగా అమలు కావాలని, విద్యార్థులకు శుభ్రమైన మరియు సురక్షిత వాతావరణంలో భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి రాజ్ కుమార్, జిల్లా విద్యాధికారి రాము, బీసీ సంక్షేమాధికారి సునీత, తహసీల్దార్ ఎండి అబ్దుల్ మజీద్, ఎంపిడీవో రవీందర్ రావు, మండల విద్యాధికారి చెరుకు రాజన్న, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నిర్మల, ఉపాధ్యాయులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వాక్యాలను ఖండించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**గొల్లపల్లి ఏప్రిల్ 20ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో మండల కాంగ్రెస్ పార్టీ పత్రిక సమావేశం లో మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మాట్లాడుతూమాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ లక్ష్మణ్ కుమార్ మీద చేసిన అనుచిత వాక్యాలను మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిచారు ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే మంత్రి మీద బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు అన్నారుధర్మపురి నియోజకవర్గం గా ఏర్పడ్డ నాటి నుండి ధర్మపురి కి మీరే ఎమ్మెల్యేగా చీఫ్ విప్ గా మంత్రి గా ప్రాతినిధ్యం వహించారు మీ హయాంలో మీరు ధర్మపురిని ఎందుకు అన్ని విధాలుగా అభివృద్ధి చేయలేకపోయారు ధర్మపురి లోనీ టెలండ్ గ్రామాలకు నీళ్లు అందించలేకపోయారు, ధర్మపురి తలాపన గోదావరి ఉన్న చివరి వరకు అందించలేని స్థితిలో మీరు అప్పుడు ఉన్నారు, మన ప్రాంత నీటిని అప్పటి మంత్రులు వారి నియోజకవర్గాలకు సిద్దిపేట సిరిసిల్లకి తరలించుకుపోతుంటే చూస్తూ ఉన్నారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్యే గా గెలిచిన నాటినుండి నేటి వరకు ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి కొరకు ఎల్లవేళల కష్టపడుతున్నారు. ధర్మపురి నైట్ కలశాలని ఓపెన్ ధర్మపురి డిగ్రీ కళాశాలని తీసుకురావడం జరిగింది. ధర్మపురిని మీకంటే మంచిగా అభివృద్ధి చేస్తున్నందుకు మొన్న జరిగినటువంటి మున్సిపల్ ఎన్నికలలో 15 కి 15 స్థానాల్లో అభ్యర్థులు గెలవడం జరిగింది లక్ష్మణ్ కుమార్ పనితనానికి ధర్మపురి ప్రజలు ఇచ్చిన బహుమతి వీటిని చూసి ఓర్వలేక మీరు విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారు ప్రజా ప్రభుత్వం ఏర్పాటినయిన తరువాత ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంటు మహిళా సోదరీమణులకు ఉచిత బస్సు పేదవాళ్ల సొంత ఇంటి కలని నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకొచ్చి పేదల కలలు నిజం చేయడానికి ఇళ్లులేని పేదలకి ఇందిరమ్మ ఇండ్లు గడిచిన 10 సంవత్సరాలలో మీరు అధికారంలో ఉండి కూడా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం మొన్ననే రైతు భరోసా ద్వారా రైతులకు ఎకరానికి 6000 చొప్పున వారి ఖాతాలలో జమ చేయడం ఈ రోజు 5 ఎకరాలలోపు ఉన్న రైతులకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా ద్వారా నగదును వారికి అందజేయడం జరుగుతుంది. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వలేకనే మీరు మా ప్రభుత్వం లక్ష్మణ్ కుమార్ మీద విషం జిమ్మె ప్రయత్నం చేస్తున్నారు ఇది మీకు తగదు మరొకసారి మా నాయకుని మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన మిమ్మల్ని హెచ్చరిస్తున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కొక్కల జలంధర్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్ సర్పంచులు కాసరపు భవాని అరవింద్ గౌడ్ మ్యాక స్వామి కసం రాజశేఖర్ కాషా అంజలి గంగాధర్ జెల్ల అఖిల అనిల్ బుర్ర సుధారాణి భూమయ్య గౌడ్ మాజీ సర్పంచ్ చిర్ర గంగాధర్ నాయకులు శనిగారం మల్లేశం, కొండా వెంకటేష్ గౌడ్ నేరెళ్ల మహేష్, చెవులమద్ది గంగాధర్ కంది వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుపై బీజేపీది డ్రామా

### సీనియర్ కాంగ్రెస్ నేత పాండుగౌడ్ ధ్వజం

**సికింద్రాబాద్, ఏప్రిల్ 20 ( ప్రజామంటలు):** మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తోందని సికింద్రాబాద్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళా బిల్లుకు వ్యతిరేకం కాదని, అయితే ప్రతిపక్షాల అనుమానాలను నివృత్తి చేయడంలో బీజేపీ పూర్తిగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. 2023 సెప్టెంబర్ 28నే పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదం పొందినా, ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చకపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. 543 పార్లమెంట్ సీట్లలో మహిళలకు 33 శాతం వాటా ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేదని, వారిపై ఆ పార్టీకి గౌరవం కానీ, సానుకూల దృక్పథం కానీ లేదని ధ్వజమెత్తారు. బీజేపీ నేతలు కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తారని, మహిళా సాధికారతపై వారికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మహిళా బిల్లు అమలుపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, డీలిమిటేషన్‌తో ముడిపెట్టకుండా వెంటనే అమలు చేయాలని పాండుగౌడ్ డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా బిల్లును ప్రవేశపెడితే ప్రతిపక్షాలన్నీ బేషరతుగా మద్దతు ఇస్తాయని స్పష్టం చేశారు. అయితే డీలిమిటేషన్ ముసుగులో దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయ ఆధిపత్యం చెలాయించాలని, ఇక్కడి ప్రాధాన్యతను తగ్గించి తీవ్ర అన్యాయం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్ పేరును సాకుగా చూపి మహిళా బిల్లును అడ్డుకోవాలని చూడటం బీజేపీ నక్కజిత్తుల తెలివితేటలకు నిదర్శనమని, ఈ విషయాన్ని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. బీజేపీలో మహిళలకు ఎక్కడైనా సముచిత స్థానం ఉందా అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ఆడుతున్న ఈ నాటకాలను, చేస్తున్న కుట్రలను ప్రజలకు పూర్తిస్థాయిలో విడమర్చి చెప్తామని, ఈ ప్రజా ప్రభుత్వంలో వారి అబద్ధాలను సాగనివ్వబోమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని వేషాలు వేసినా, మహిళా లోకం వారిని ఎప్పటికీ క్షమించదని పాండుగౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## జీవన్ రెడ్డి చేరిక సమయంలో బీఆర్ఎస్ పార్టీలో ముసలంబిజగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల ఏప్రిల్ 20 (ప్రజా మంటలు) :** జీవన్ రెడ్డి చేరిక సమయంలో బి ఆర్ఎస్ పార్టీలో ముసలం పుట్టిందని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మోతే పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డి చేరికను హరీష్ రావు వ్యతిరేకిస్తున్నారని అందుకేజగిత్యాల సభ కు రాకుండా రహస్యంగా ఢిల్లీకి హరీష్ రావు వెళ్లారన్నారు. జీవన్ రెడ్డి చేరిక పైన హరీష్ రావు అసంతృప్తిగా ఉన్నారన్నారు. ఆయన చేరికను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న హరీష్ రావు . జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించడానికి కూడా ఇష్టపడని హరీష్ రావు అనిజీవన్ రెడ్డి ది ఐరన్ లెగ్ గా భావిస్తున్నారు బీఆర్ఎస్ శ్రేణులు అని దా సంజయ్ అన్నారుజీవన్ రెడ్డి కారణంగా బీఆర్ఎస్ లో చీలిక వచ్చే ఛాన్స్ ఉందని పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైందన్నారు. జీవన్ రెడ్డి చేరిక బీఆర్ఎస్ కు ఒక్క రోజు పండుగ మాత్రమే అన్నారుఇప్పటికే బీఆర్ఎస్ నుంచి బయటకు పోయి కొత్త పార్టీ పెట్టనున్న కవిత.. తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని హరీష్ రావు కి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విజప్తి చేశారన్నారు. బీఆర్ఎస్ లోనే ఉండి జీవన్ రెడ్డి చేరిక పై మనం పోరాడుదామని హరీష్ రావు కు స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి వల్ల ఎన్ టి ఆర్, తక్కువ వ్యవధిలో నాదెండ్ల భాస్కర్ పదవి కోల్పోయారు. రెండవ సారి ఎమ్మెల్యే గా గెలిచా, ఇరిగేషన్ పై పూర్తి అవగాహన ఉంది. మేడిగడ్డ సభలో ముఖ్యమంత్రి ఇరిగేషన్ అభివృద్ధి పనుల పై స్పష్టమైన ఆదేశాలు హామీలు ఇస్తారని భావిస్తున్న అన్నారు. జగిత్యాల అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి తో కలిసి పనిచేస్తున్నా... రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో, జీవన్ రెడ్డి పార్టీ వీడడం లో నా జోక్యం ఎప్పుడు లేదనీ తెలిపారు. గతంలో జీవన్ రెడ్డి రేవంత్ కావాలి కేసీఆర్ పోవాలి అన్నారు. ఒక మాసం నుండి రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలి అని అంటున్నారన్నారు. ఇవి పూర్తిగా ప్యాకేజీ మాటలు ఇలాంటి మాటలు సీనియర్ రాజకీయం అనుభవం ఉండి మాట్లాడటం విడ్డూరం గా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, టిపిసిసి సెక్రటరీ బండ శంకర్, పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్, మైనార్టీ అధ్యక్షులు మన్సూర్, ఏ ఎం సి చైర్మెన్ గడ్డంనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు దామోదర్ రావు, గట్టు సతీష్, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, నక్కల రవీందర్ రెడ్డి, గోలి శ్రీనివాస్, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, కత్రోజ్ గిరి, శరత్ రావు, ముకేష్ ఖన్నా, కౌన్సిలర్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

### పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల ఏప్రిల్ 20 (ప్రజా మంటలు) :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపుకలెక్టర్ ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 63 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలిబిరాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్



**జగిత్యాల ఏప్రిల్ 20 (ప్రజా మంటలు) :** ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, నమోదు శాతాన్ని గణనీయంగా పెంచాలని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు అందించారు. రానున్న పది రోజులలో ప్రత్యేక ఓటర్ సవరణలో పురోగతి సాధించేందుకు అన్ని స్థాయిల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూబూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించాలని, ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేరు మార్పులు, చిరునామా మార్పులు వంటి అంశాలను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అలాగే, జిల్లాలోని ఆర్డీవోలు బిఎల్ఓలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, నమోదు శాతం పెంపు పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రతి రోజు పురోగతిని సమీక్షిస్తూ, లక్ష్యాలను సాధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూరాష్ట్ర ఎలెక్టరోల్ ఆదేశాలను పాటిస్తూ జిల్లాలో ని జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి డివిజనల్ అధికారులతో మరియు బిఎల్ వో లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటరు నమోదు శాంతం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, తహసీల్దారులు, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గారం లో బడిబాట

### గల్లీ - గల్లీ లో విద్యార్థుల ర్యాలీ



**బుగ్గారం:** ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించండి, వారి ఉజ్వల భవిష్యత్ ను తీర్చిదిద్దుతాం అంటూ బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, పూర్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థిని - విద్యార్థులతో ఉపాధ్యాయినీ - ఉపాధ్యాయులు, అంగన్ వాడి టీచర్ లు గల్లీ - గల్లీ కి వెళ్లి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో ప్రధానోపాధ్యాయులు అన్నాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, శిక్షణా నైపుణ్యం తో అనుభవం గల బోధనా టీచర్ల గూర్చి వివరించారు. బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ, స్కూల్ మేనేజ్మెంట్ కమిటి ప్రతినిధులు, పూర్వ విద్యార్థి, సామాజిక కార్యకర్త, విడిసి వ్యవస్థాపక అధ్యక్షులు చుక్క గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్షకొండలో బడిబాట కార్యక్రమం

### హెచ్‌ఎం బి రాజేందర్



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 20 (ప్రజా మంటలు దగ్గుల అశోక్) :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్షకొండ గ్రామంలో జడ్.పి.హెచ్.ఎస్ వర్షకొండ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు బి రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించినరు, బడిబాట కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి విద్యార్థుల కోసం తల్లిదండ్రులని కలిసి పాఠశాల లో జరిగే కార్యక్రమాలను వివరిస్తూ అడ్మిషన్లు సేకరిస్తున్న క్రమంలో, గ్రామ సర్పంచ్ శ్రీ పొన్నకంటి చిన్న వెంకట్ వారి యొక్క కుమార్తె పొన్నకంటి తేజస్వినిని మా పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు, అలాగే గ్రామంలో ఇతర పాఠశాలలకు పంపే తల్లిదండ్రులకు కూడా మన ఊరి పాఠశాలలో అన్ని చక్కని వసతులు ఉన్నాయని ఉపాధ్యాయులు మంచిగా బోధిస్తున్నారు, అలాగే అమ్మాయిలకు కుట్టు పని, అబ్బాయిలకు వ్యవసాయం పని, చదువుతోపాటు నేర్పిస్తున్నారని ఇట్టి అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. వార్డు సభ్యులు కూడా వారి ఇంట్లో పిల్లల్ని వర్షకొండ ఉన్నత పాఠశాలలో చేర్పించుటకు సంసిద్ధత సిద్ధంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శివ కృష్ణ, ఇమ్మానుయేల్, స్వామి మరియు గ్రామంలోని పెద్దలు పాల్గొన్నారు.

## వర్షకొండ బస్‌స్టాండ్‌లలో చలివేంద్రాలు ప్రారంభించిన సర్పంచ్ వెంకట్





**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20:** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్షకొండ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం గాంధీ, అంబేడ్కర్ బస్‌స్టాండ్‌ల వద్ద చలివేంద్రాలను సర్పంచ్ వెంకట్ ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రతిరోజూ తాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జయ, నర్సయ్య, కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల ఏప్రిల్ 20 (ప్రజా మంటలు) :** బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశంప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 6 గురు అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

## నిరాశ్రయులకు అండగా స్కై ఫౌండేషన్



**సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (ప్రజా మంటలు):** అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని నిరాశ్రయులకు స్కై ఫౌండేషన్ అండగా నిలిచింది. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని ఆధ్వర్యంలో మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలిగించేలా మానవీయ కార్యక్రమాన్ని చేపట్టారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్న నిరుపేదలకు ఆమె గొడుగులు, చెప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ.. ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న అభాగ్యులకు తమ వంతు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఫౌండేషన్ చేస్తున్న ఈ సాయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## కొప్పుల ఈశ్వర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండలాధ్యక్షుడి ధ్వజం



**గొల్లపల్లి ఏప్రిల్ 20ప్రజా మంటలు :** మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రస్తుత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ బుగ్గారం మండలాధ్యక్షుడు వేముల సుభాష్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి శూన్యం.. మాటలు మెండగత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బుగ్గారం మండల కేంద్రం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని వేముల సుభాష్ విమర్శించారు. అభివృద్ధిని విస్మరించిన నాయకులు ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రగతికి బాటలురాష్ట్రంలో హస్తం పార్టీ అధికారంలోకి రాగానే మార్పు కనిపిస్తోందని, మండల అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ప్రధాన అంశాలుకార్యాలయాల అభివృద్ధి: మండల కేంద్రంలోని ఎంఆర్ఓ ఎంపీడీవో కార్యాలయాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి ఎటువంటి రాజీ లేకుండా ప్రభుత్వం కృషి చేస్తోంది. రోడ్డు నిర్మాణం: ప్రజల సౌకర్యార్థం గంగాపూర్ నుంచి బుగ్గారం వరకు గల రహదారిని త్వరితగతిన నిర్మించారుసంక్షేమ పథకాలు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేపడతామని స్పష్టం చేశారు. అవినీతి రహిత పాలన: సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ ( మంజూరు విషయంలో ఎక్కడా అవినీతికి తావులేకుండా, పూర్తి పారదర్శకతతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నగునూరి నర్సాగౌడ్ సర్పంచ్ లు నీలం నందిని సంతోష్, గాదే మహేష్, ఉపసర్పంచ్ జంగా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లు కొండపల్లి సంతోష్ రావు, బత్తుల తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షులు కొడిమ్యాల రాజన్న, కస్తూరి మల్లేష్, రెంటం శ్రీధర్, మహేష్ , సమీద్ పాల్గొన్నారు.

# పంది కడుపున గజరాజు

**నాగర్‌కర్నూల్‌లో వింత ఘటన.. చూసేందుకు పోటెత్తిన జనం!**

**నాగర్‌కర్నూల్ జిల్లాలో పంది కడుపున ఏనుగును పోలిన పిల్ల జననం**

**తొండం, పెద్ద చెవులతో ఉన్న పిల్లను చూసి ఆశ్చర్యపోయిన గ్రామస్థులు**

**ఇది బ్రహ్మంగారి కాలజ్ఞానం ఫలితమంటూ స్థానికుల చర్చ**

**జన్యుపరమైన లోపమే కారణమంటున్న పశువైద్య నిపుణులు**

**పుట్టిన కొద్దిసేపటికే వింత పందిపిల్ల మృతి**



నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ వింత ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఓ పంది, ఏనుగును పోలిన పిల్లకు జన్మనివ్వడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అచ్చం ఏనుగులా తొండం, పెద్ద చెవులతో జన్మించిన ఈ వింత జీవిని చూసేందుకు జనం తరలివస్తున్నారు. ఈ ఘటన పెద్దకొత్తపల్లి మండలం కార్వాముల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ వింత జననానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.వివరాల్లోకి వెళితే... కార్వాముల గ్రామానికి చెందిన కురాకుల వెంకటయ్య పందులను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన పెంచుతున్న ఓ పంది ఇటీవల మొదటి ఈతలో ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. వాటిని పరిశీలించిన వెంకటయ్యకు ఓ విచిత్రమైన దృశ్యం కంటపడింది. ఆ ఏడు పిల్లల్లో ఒకటి మిగతావాటికి భిన్నంగా ఏనుగు ఆకారంలో ఉండటంతో ఆయన నివ్వెరపోయాడు. ఆ పందిపిల్లకు ముఖభాగంలో తొండం, తలకు ఇరువైపులా పెద్ద చెవులు ఉన్నాయి.ఈ వింత విషయం ఆ నోటా ఈ నోటా చుట్టుపక్కల గ్రామాలకు పాకింది. దీంతో ఆ ఏనుగు రూపంలోని పందిపిల్లను చూసేందుకు ప్రజలు వెంకటయ్య ఇంటికి పెద్దఎత్తున తరలివచ్చారు. కొందరు దీనిని ప్రకృతి విచిత్రంగా అభివర్ణిస్తుంటే, మరికొందరు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తన కాలజ్ఞానంలో చెప్పినట్లు కలియుగంలో ఇలాంటి వింతలు సహజమేనని చర్చించుకుంటున్నారు.అయితే దురదృష్టవశాత్తూ, ఆ వింత పందిపిల్లతో పాటు మరో పిల్ల పుట్టిన కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాయి. ప్రస్తుతం మిగిలిన ఐదు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయని యజమాని వెంకటయ్య తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన పశువైద్య నిపుణులు, ఇది దైవ మహత్యమో, వింత శక్తో కాదని స్పష్టం చేశారు. గర్భంలో పిండం ఎదుగుదల సరిగా లేనప్పుడు లేదా జన్యుపరమైన లోపాల వల్ల ఇలాంటి శారీరక మార్పులు సంభవిస్తాయని వివరించారు. దీనిని వైద్య పరిభాషలో 'కంజెనిటల్ అబ్నార్మాలిటీ' (పుట్టుకతో వచ్చే వైకల్యం) అంటారని, ఇలాంటి వింత ఆకారాలతో పుట్టిన జీవులు ఎక్కువ కాలం బతకడం అరుదని వారు పేర్కొన్నారు.

# రోబో శునకంపై ఎలాన్ మస్క్ తల... చూసి షాకైన జనం

**శాన్‌ఫ్రాన్సిస్కో వీధుల్లో చక్కర్లు కొడుతున్న ఎలాన్ మస్క్ ముఖంతో రోబో డాగ్**

**ఆర్టిస్ట్ బీపుల్ 'రెగ్యులర్ యానిమల్స్' ఎగ్జిబిషన్ ప్రచారంలో భాగంగా ఈ ప్రదర్శన**

**మస్క్‌తో పాటు జుకర్‌బర్గ్, జెఫ్ బెజోస్ ముఖాలతోనూ రోబోల తయారీ**

**ఈ వింత రోబోలపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు**



మూడేళ్ల తర్వాత ఈ రోబోలు 'చనిపోతాయని' సృష్టికర్తల వెల్లడి

అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో వీధుల్లో ఓ వింత దృశ్యం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎలాన్ మస్క్ ముఖంతో ఉన్న ఓ నాలుగు కాళ్ల రోబో నగరంలో చక్కర్లు కొట్టింది. మనుషులకు అభివాదం చేయడం, కాళ్లు పైకెత్తి పలకరించడం, ఎదురైన నిజమైన కుక్కలకు మొరగడం వంటి పనులు చేస్తూ అందరి దృష్టినీ ఆకర్షించింది. డిజిటల్ ఆర్టిస్ట్ బీపుల్ (అసలు పేరు మైక్ వింకెల్‌మన్) తన కొత్త ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రచారం కోసం ఈ రోబోలను ప్రదర్శనకు ఉంచినట్లు తెలిసింది.పాలో ఆల్టోలోని 'చీూణజు' అనే డిజిటల్ ఆర్ట్స్ సెంటర్‌లో "రెగ్యులర్ యానిమల్స్" పేరుతో బీపుల్ ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కేవలం మస్క్ మాత్రమే కాకుండా ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్, అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్, ప్రఖ్యాత చిత్రకారులు పాబ్లో పికాసో, ఆండీ వార్హోల్ వంటి ప్రముఖుల ముఖాలతో కూడా రోబోలను సృష్టించారు. అయితే, శాన్‌ఫ్రాన్సిస్కో వీధుల్లో మాత్రం మస్క్, జుకర్‌బర్గ్ ముఖాలున్న రోబోలనే ప్రదర్శించారు. వీటిని చూసేందుకు జనం ఆసక్తి చూపించారు.'యూనిట్రీ గో2' అనే క్వాడ్రుపెడ్ రోబో బాడీకి, మనిషి ముఖంలా కనిపించే హైపర్‌ఫ్లెష్ సిలికాన్ మాస్క్‌ను అమర్చి ఈ రోబోలను తయారు చేశారు. ఈ రోబోలను మూడేళ్ల పాటు సజీవంగా ఉంచుతామని, ఆ తర్వాత అవి 'చనిపోతాయని', వాటి జ్ఞాపకాలను భద్రపరుస్తామని సృష్టికర్తలు చెప్పడం గమనార్హం.ఈ వింత రోబోలపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీనిని "అద్భుతం", "సరదాగా ఉంది" అని ప్రశంసించగా, మరికొందరు "వికారంగా", "ఇబ్బందికరంగా ఉంది" అని విమర్శించారు. దీనిపై చీూణజు సెంటర్ ప్రతినిధి ఫిల్ మోహన్ మాట్లాడుతూ.. "ప్రజల దృష్టిని ఆకర్షించి, వారి మధ్య చర్చ జరిగేలా చేయాలనేది బీపుల్ కళ ముఖ్య ఉద్దేశం. ఈ రోబోలు ఆ పనిని విజయవంతంగా చేస్తున్నాయి. డిజిటల్ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగానే ఈ ప్రదర్శన ఏర్పాటు చేశాం" అని వివరించారు. "×చీఖీ×చీ×ుజుబీూూా" పేరుతో జరుగుతున్న ఈవెంట్‌లో భాగంగా ఈ రోబోలను ప్రదర్శిస్తున్నారు. అయితే, ఈ రోబోల కోసం మస్క్, జుకర్‌బర్గ్ అనుమతి తీసుకున్నారా? లేదా? అన్న విషయంపై స్పష్టత లేదు.

# మోదీ ఝూల్‌మురీ.. .. సీఎం హెలికాప్టర్‌కు ల్యాండింగ్ బంద్!

**ప్రచారంలో భాగంగా ఝూల్‌మురీ తిన్న ప్రధాని మోదీ**

**మోదీ పర్యటన వల్లే సోరెన్ హెలికాప్టర్‌కు ల్యాండింగ్ నిరాకరించారన్న టీఎంసీ**

**ఇది ఆదివాసీ వ్యతిరేక చర్య అంటూ టీఎంసీ ఆరోపణ**

**"లూటీలో పీహెచ్‌డీ" చేసిందంటూ టీఎంసీపై మోదీ విసుర్లు**



పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ఓ చిన్నపాటి స్నాక్ బ్రేక్ పెద్ద రాజకీయ దుమారానికి దారితీసింది. ప్రధాని నరేంద్ర మోదీ రోడ్డు పక్కన 'ఝూల్‌మురీ' తినడం కోసం తన పర్యటనను పొడిగించారని, ఆ కారణంగానే జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ హెలికాప్టర్‌కు ల్యాండింగ్ అనుమతి నిరాకరించారని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తీవ్రంగా ఆరోపించింది.ఝూర్గ్రామ్‌లో ఓ బహిరంగ సభ ముగించుకున్న ప్రధాని మోదీ తన కాన్వాయ్‌ను ఆపి మరీ రోడ్డు పక్కన ఉన్న బండి వద్ద ఝూల్‌మురీ (మురముురాల మిశ్రమం) రుచి చూశారు. ఓ సాధారణ వ్యక్తిలా వ్యాపారితో ముచ్చటిస్తూ "ఉల్లిపాయలు వేస్తారా?" అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తన జేబులో నుంచి డబ్బులు తీసి చెల్లించడం అక్కడున్న వారిని ఆశ్చర్యపరిచింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.అయితే, ఈ ఘటనపై టీఎంసీ తీవ్రస్థాయిలో మండిపడింది. కేవలం ఫోటోషూట్ల కోసమే ప్రధాని తన పర్యటనను అనవసరంగా పొడిగించారని, దానివల్లే ఝూర్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఆయన భార్య ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు ల్యాండింగ్ క్లియరెన్స్ లభించలేదని ఆరోపించింది. "ఆదివాసీ నాయకులను గంటల తరబడి వేచి చూసేలా చేసి, చివరికి వారిని రాంచీకి తిప్పి పంపారు. ఇది ముమ్మాటికీ ఆదివాసీ వ్యతిరేక చర్య" అని టీఎంసీ తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది.ఈ వివాదం కొనసాగుతుండగానే, ప్రధాని మోదీ టీఎంసీపై తన విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. మేదినీపూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... "గత 15 ఏళ్లలో తృణమూల్ ప్రభుత్వం లూటీ చేయడంలో పీహెచ్‌డీ చేసింది. మమతా బెనర్జీ సర్కార్ కేవలం చొరబాటుదారుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోంది" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రైతులు, యువతను విస్మరించి అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

# లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనికుడి ఉన్మాదం.. ఏసు విగ్రహంపై దాడి

**చర్చిలో ఏసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఇజ్రాయెల్ సైనికుడు**

**సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫోటోలు, వీడియోలు**

**ఘటనపై తీవ్ర నిరసనలు.. స్పందించిన ఇజ్రాయెల్ రక్షణ దళం**

**దర్యాప్తునకు ఆదేశించామని, చర్యలు తీసుకుంటామని ఐడీఎఫ్ ప్రకటన**

**ఘటనను ధ్రువీకరించిన స్థానిక మున్సిపాలిటీ అధికారులు**



ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దులో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఓ ఇజ్రాయెల్ సైనికుడి చర్య తీవ్ర వివాదానికి దారితీసింది. లెబనాన్‌లోని ఓ క్రైస్తవ గ్రామంలో ఉన్న ఏసుక్రీస్తు విగ్రహాన్ని సుత్తితో ధ్వంసం చేస్తున్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి.దక్షిణ లెబనాన్‌లోని డెబెల్ అనే క్రైస్తవ గ్రామంలోని చర్చి ఆవరణలో ఈ ఘటన చోటుచేసుకుంది. సిలువ నుంచి కిందకు దించినట్లుగా ఉన్న క్రీస్తు విగ్రహం తలపై సైనికుడు సుత్తితో కొడుతున్న దృశ్యాలు క్రైస్తవ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. యుద్ధ క్షేత్రంలో మతపరమైన చిహ్నాలపై ఇలాంటి దాడులు చేయడం అమానుషమని నెటిజన్లు మండిపడుతున్నారు.ఈ ఘటనపై విమర్శలు తీవ్రం కావడంతో ఇజ్రాయెల్ రక్షణ దళం స్పందించింది. వైరల్ అవుతున్న ఫోటోల్లోని చర్యలు తమ సైనిక విలువలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించామని ఐడీఎఫ్ ప్రతినిధి నదవ్ శోషానీ తెలిపారు. ఫోటో నిజమైనదని తేలితే, బాధ్యుడైన సైనికుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.కాగా, డెబెల్ మున్సిపాలిటీ అధికారులు ఈ ఘటన జరిగిన విషయాన్ని ధ్రువీకరించారు. అయితే, విగ్రహానికి జరిగిన నష్టంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

# సత్తెనపల్లిలో నర్సు ఆత్మహత్య.. ఆర్‌ఎంపీ వైద్యుడిపై ఆరోపణలు

**మృతురాలు స్థానిక క్లినిక్‌లో నర్సుగా పనిచేస్తున్న గోవర్ధన (40)**

**ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణం**

**ఆర్‌ఎంపీ డాక్టర్ కొట్టడంతోనే మనస్తాపానికి గురైనట్లు ఆరోపణలు**

**ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో విషాదం చోటుచేసుకుంది. స్థానిక వావిలాల నగర్‌లో గోవర్ధన (40) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆమె బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళ్తే, గోవర్ధన స్థానికంగా ఉన్న ఒక క్లినిక్‌లో నర్సుగా పనిచేస్తున్నారు. అయితే, ఆమె పనిచేస్తున్న క్లినిక్‌లోని ఆర్‌ఎంపీ డాక్టర్ కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, ఆ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. గోవర్ధన ఆత్మహత్యకు దారితీసిన కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

# సింహాచలంలో చందనోత్సవం అప్పన్న నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు

**సంవత్సరానికి ఒకసారి నిజరూపంలో దర్శనమిస్తున్న అప్పన్న**

**ప్రభుత్వం తరఫున స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన హోంమంత్రి అనిత**

**తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు**

**స్వామివారిని దర్శించుకున్న పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు**



సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక చందనోత్సవం సోమవారం అంగరంగవైభవంగా ప్రారంభమైంది. ఏడాదికి ఒక్కసారి మాత్రమే లభించే అప్పన్న నిజరూప దర్శనం కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో సింహగిరికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.ఆలయ అనువంశిక ధర్మకర్త పి. అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులు స్వామివారికి తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున హోంమంత్రి వంగలపూడి అనిత స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ తదితర ప్రముఖులు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకున్నారు.భక్తుల రద్దీ విపరీతంగా ఉండటంతో వారిని నియంత్రించేందుకు హోంమంత్రి అనిత స్వయంగా రంగంలోకి దిగి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం, జిల్లా అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. రాత్రి వరకు నిజరూప దర్శనం కొనసాగి, ఆ తర్వాత స్వామివారికి మళ్లీ చందనపు పూత వేయనున్నారు.

# విజయవాడ పటమట క్యాంటీన్‌కు సీఎం దంపతులు

**సీఎం చంద్రబాబు తన జన్మదినం సందర్భంగా అన్న క్యాంటీన్‌కు**

**విజయవాడ పటమట క్యాంటీన్‌లో అల్పాహారం చేయనున్న సీఎం దంపతులు**

**అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షలు విరాళం ప్రకటించిన నారా భువనేశ్వరి**

**నేడు రాష్ట్రంలోని 269 క్యాంటీన్లలో ఉచితంగా ఆహారం**



సీఎం చంద్రబాబు నాయుడు తన జన్మదినం సందర్భంగా ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈరోజు ఉదయం 9:30 గంటలకు విజయవాడలోని పటమట అన్న క్యాంటీన్‌కు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి వెళ్లి అల్పాహారం చేయనున్నారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లోనే తన పుట్టినరోజు వేడుకను జరుపుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు.ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని నారా భువనేశ్వరి భారీ విరాళం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్ల ఒక రోజు నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఆమె రూ.76 లక్షలను విరాళంగా అందించారు. ఈ విరాళంతో నేడు రాష్ట్రంలోని అన్ని అన్న క్యాంటీన్లలో ప్రజలకు ఉచితంగా ఆహారాన్ని అందించనున్నారు.ముఖ్యమంత్రి జన్మదినం రోజున రాష్ట్రవ్యాప్తంగా పేదలు, సామాన్యులు ఉచితంగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సీఎం దంపతుల రాక సందర్భంగా పటమట అన్న క్యాంటీన్ వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com